# మెత్తని మనసు

— మునిపల్లె లక్ష్మీరమణకుమారి

సురేఖా నర్సింగ్ హోమ్!

కారిడార్లోంచి నడుస్తున్న మాధవి స్పెషల్ రూమ్‌వైపు మలుపు తిరిగింది. తన స్నేహితురాలు మనోరమను చూసేందుకు వచ్చింది మాధవి. కుడివైపు లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్ వగైరా ఉన్నాయి. కాస్త ముందుకి గైనకాలజిస్ట్ గది వుంది. చిన్న హాస్పిటలేగానీ అన్ని వసతులూ ఉన్నాయి.

ఇంతలో లేడీ డాక్టర్ రూమ్‌లోంచి వినవచ్చిన మాటలు, సన్నని ఏడుపూ మాధవి కాళ్ళకు బంధం వేశాయి. కొన్ని మాటలు చెవినపడ్డాయి కూడా. ఆ మాటలు విని, అనుకోకుండానే అటు చూసిన మాధవికి షాక్ తగిలినట్లయింది. చేష్టలు దక్కి చూస్తుండిపోయింది.

గతం ఆమె కళ్ళముందు కదిలింది.

★★★

పాతికేళ్ళక్రితం సంగతి. అప్పుడు మాధవి వయసు ఇరవై. భర్త ఉద్యోగం చేస్తున్నా, ఆడపడుచుల పెళ్లి ఖర్చులు, అత్తగారి వైద్యం డబ్బులు వగైరాలతో అప్పుల్లో మునిగి తేలాల్సిన పరిస్థితి ఏర్పడింది. తనూ ఉద్యోగం చేస్తే బావుంటుందని అనుకుని కాంపిటీటివ్ పరీక్షలు రాసింది మాధవి. ఒక ఆఫీసులో ఎల్డీసీగా ఉద్యోగంలో ప్రవేశించింది.

డబ్బు ఇబ్బందులు కాస్త తొలగిపోతున్నాయి. ఇంటా బయటా కష్టపడి చేసుకుపోతున్నది. నిజానికి అవి ఆనందంగా గడపాల్సిన రోజులు. మాధవితోపాటు చేరినవాళ్ళంతా చక్కటి చీరలు, మేకప్‌తో ఆఫీసుకు స్టైల్‌గా వచ్చేవాళ్ళు. అప్పుడప్పుడు సినిమాలు చూస్తూ, హోటల్లో భోజనాలు, ఫలహారాలు చేస్తూ నవ్వుతూ తుళ్ళుతూ బతికేవాళ్లు. ఆర్థిక ఇబ్బందులవల్ల మాధవి వాళ్ళలా ఉండలేకపోయినా ఏదో కష్టపడి సంపాదించి అప్పులు తీర్చుకుంటున్నామన్న మనశ్శాంతి కూడా లేకుండా శనిలా దాపురించాడు నీలకంఠం.

మాధవి వాళ్ళు వుంటున్నది నాలుగు వాటాలున్న ఒక మేడలో. అందులోనే నీలకంఠం తన కుటుంబంతో ఉండేవాడు. మాధవి భర్తతో స్నేహం చేసుకున్నాడు.

నీలకంఠం పని చేసే ఆఫీసులో పనికీ, మాధవి ఆఫీసుకీ కనెక్షన్ ఉండేది. ఆ పనిమీద నీలకంఠం తరచూ మాధవి ఆఫీసుకి వచ్చిపోతుండేవాడు. వచ్చినవాడు తన పని చూసుకునిపోక మాధవితో మాట్లాడి వెళ్తుండేవాడు.

నీలకంఠం చిత్రంగా ప్రవర్తించేవాడు. మాధవి తన సీట్లో పని మూలంగా నాలుగైదు సెక్షన్లు తిరగాల్సి వచ్చేది. మాధవి ఆయా సెక్షన్లకి పోయిన అయిదు నిముషాలకల్లా నీలకంఠం ఎలా కనిపెట్టేవాడోగానీ మాధవి సెక్షన్‌కి వచ్చేసేవాడు.

"ఏదండీ మాధవి. ఎటు పోయింది? ఎక్కడికి వెళ్లింది? ఇంకా రాలేదేంటి?" అనేవాడు.

అతను ఇలా మాట్లాడుతుంటే అంతా మాధవి అతనికి చాలా క్లోజ్ కాబోలని అనుకునేవాళ్ళు. ఆ విధంగా తన ప్రయత్నంలో కృతకృత్యుడై అక్కడ్నించి బయల్దేరి మాధవిని వెతుక్కుంటూ ఆమె వెళ్లిన సెక్షన్‌కి వెళ్లి వాలేవాడు.

"ఏం చేస్తున్నారు? ఎక్కడికి వెళ్లారోనని వెతుకుతున్నాను" అని నవ్వేవాడు.

ఆఖరికి ఎప్పుడన్నా తలనొప్పిగా ఉండి మందులు కొనుక్కుందామని వెళ్లినా వెంబడించేవాడు.

కొన్నాళ్ళు మర్యాదకోసం ఊరుకుంది మాధవి. ఆ తరువాత "మీ పనేదో చూసుకుని వెళ్లండి. నా వెనక రాకండి" అని చెప్పింది.

"వెనక రావడంలేదు. ఎక్కడికెళ్లారోనని చూస్తున్నాను" అని పళ్లికిలించాడు నీలకంఠం.

"నేనెక్కడికి వెళితే మీకేంటి? ఎందుకిలా చేస్తున్నారు?" కాస్త కోపంగా అడిగింది మాధవి.

"అదేంటి? అంత కోపం దేనికి? ఎక్కడెక్కడ తిరుగుతున్నారోనని చూస్తున్నాను."

"మర్యాదగా మాట్లాడండి. అయినా అసలు నా సంగతి మీకెందుకు?" మాధవి మొహం ఎర్రబడింది.

"ఊరికే. ఇరుగూపొరుగూ కదా. కాస్త కనిపెట్టి ఉందామనీ" నీలకంఠం తాపీగా నవ్వుతూ అన్నాడు.

"మీరెవరు ఆ పని చేయడానికి?" మాధవికి కోపం ఆగలేదు.

"మీ ఆయన తన పనుల్లో బిజీ. ఆయన ఎలాగూ మిమ్మల్ని కనిపెట్టి ఉండలేడు. ఆడవాళ్ళుకదూ. బయటకు వస్తే ఒక్కసారిగా దొరికిన స్వేచ్ఛవల్ల చెడిపోతారేమోనని..." నీలకంఠం పెద్దగా నవ్వాడు.

మాధవికి అవమానంతో, ఆవేదనతో కళ్ళల్లోంచి నీళ్ళు వచ్చేసాయి. ఉబుకుతున్న కన్నీళ్ళని ఆపడానికి వ్యర్థప్రయత్నం చేసింది. కానీ దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించింది. ఆమెకి అప్పుడు ఇంకా చిన్న వయసు. దేనికి ప్రాముఖ్యం ఇవ్వాలో, దేనికి ఇవ్వనక్కర్లేదో కూడా తెలీని మనసు. నీలకంఠంని చూస్తే భయం వేసింది. కుక్కకాటుకి చెప్పుదెబ్బ అన్నట్లు నీలకంఠాన్ని రెండు దులపాలన్న ఆలోచన కూడా రాలేదు. చివరికి కన్నీళ్ళతో టాయ్‌లెట్‌కి వెళ్లి అక్కడ భోరుమన్నది.

నీలకంఠం మాధవి మెతకతనాన్ని చూసి విజృంభించాడు. మాధవి భర్తతో స్నేహం పెంచాడు.

"ఆడవాళ్ళు ఉద్యోగం చేస్తే రెచ్చిపోతారు. మన బంగారం మంచిదే కావచ్చు. కానీ బయటకు వెళ్లాక ఎలాటి స్నేహాలవుతాయో ఏంటో? కాస్త కనిపెట్టి ఉండడం మంచిది. ఏదో ఆత్మీయంగా భావించి చెబుతున్నాను. ఏమీ అనుకోకండి. మా కుటుంబంలో ఆడవాళ్ళయితే కూడా నేను ఇలాగే చెబుతాను" అన్నాడు.

అతనికి మాటల గారడీ తెలుసు. అతను ఎంత చాతుర్యం చూపించాడంటే ఆఖరికి మాధవి భర్త తనే అతన్ని పరిష్కారం ఏమిటని అడిగే స్థితికి తెచ్చాడు.

"మరేం ఫర్వాలేదు. నేను అటుపోతూనే ఉంటానుగా. ఆవిడ మూవ్‌మెంట్స్ మీద ఒక కన్నువేసి ఉంచుతాన్లెండి" అని నీలకంఠం భరోసా ఇచ్చాడు.

ఆడవాళ్ళంటే నీలకంఠానికి చిన్నచూపు. ఎప్పుడూ ఏదో ఒకటి అని వాళ్ళని ఏడిపిద్దామని చూసేవాడు. ఆఫీసులో, ఇంటా బయటా అందర్నీ అనుమానంతో చూడడంతప్ప మరో విధంగా స్త్రీని

చూడడం అతనికి అలవాటులేదు.


"అదుపులో ఉంచకపోతే ఆడది పెట్రేగి పోదూ?" ఈ మాటల్ని రోజుకి రెండుసార్లయినా అనేవాడు.

నీలకంఠానికి గుర్రప్పందాల వ్యసనం ఉండేది. ఆ మోజులో డబ్బంతా ఖర్చుచేసి అప్పులు చేసేవాడు. ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళని చూస్తే అతని మనసు భగ్గుమనేది. వాళ్ళని ఏదో ఒకటి అని వాళ్ళ కన్నీరు కళ్ళజూస్తేగానీ అతని మనసు శాంతించేది కాదు.

మాధవి భర్త తనే స్వయంగా మాధవిని కనిపెట్టి ఉండమని నీలకంఠాన్ని కోరేట్లు చేశాక నీలకంఠాన్ని ఇక పట్టతరం కాలేదు.

ఉద్యోగం చేస్తుంటే పనిమీద నలుగురితో మాట్లాడక తప్పదు. అందులో మగవాళ్ళూ ఉంటారు. నీలకంఠం డేగ కళ్లతో మాధవిని వాచ్ చేస్తూనే ఉండేవాడు. ఆమె ఎవరన్నా మగవాడితో మాట్లాడినట్లు చూస్తే చాలు, ఇంటికి రాగానే మాధవి భర్తకి చెప్పేవాడు. అతను వెంటనే మాధవిని నిలదీసేవాడు. భర్తతోపాటు అత్తగారు కూడా చేరి తిట్టిపోసేది. ఆఫీసులో పని, ఇంట్లో పని, ఆపైన తిట్లు, భర్త అనుమానపు చూపులు. పోనీ ఉద్యోగం మానేస్తానంటే ఊరుకునేవాళ్ళుకాదు. తప్పనిసరిగా ఉద్యోగం చేయాలి. తల వంచుకుని పని చేసుకుని రావాలి. బానిస బ్రతుకు భరించలేక ఒక్కోసారి చచ్చిపోదామనిపించేది. ఇంతలో పిల్లలు పుట్టుకొచ్చి చావడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడింది. మంచి పొరుగు దొరకడం కూడా అదృష్టమే. నీలకంఠం మాధవి పొరుగున ఉండి, ఆమె జీవితాన్ని నిప్పులమీద నడక చేసాడు.

ఎన్నాళ్ళో ఆ నరకం భరించింది మాధవి. ఆ నరకం నుంచి తనకు విముక్తి లభించదనే అనుకుంది. ఇంతలో మాధవి ప్రార్థనలు ఫలించి ఆమె భర్త స్థలం కొని ఇల్లు కట్టాడు. సొంత ఇంట్లోకి మారారు. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. అప్పుడు మాధవికి కాస్త స్వతంత్రం లభించింది. నీలకంఠం



తన ఆఫీసుకి వచ్చినప్పుడు పలకరించినా మాట్లాడ్డం మానేసింది. ఇల్లు దూరం అయ్యాక అతను మాధవి ఇంటికి ఎక్కువసార్లు రాలేదు. మాధవి కూడా లోకాన్ని చూసి గడుసుతనం నేర్చుకుంది. బాధల్ని నిశ్శబ్దంగా భరించకూడదనీ, ఎదురు తిరగాలనీ తెలుసుకుంది. ఆమెలో ఈ మార్పు రాగానే నీలకంఠం తోక ముడిచాడు.

క్రమంగా అతని బాధ వదిలిపోయి మాధవికి ప్రశాంతత లభించింది. కానీ తన జీవితంలో నవ్వుతూ హాయిగా గడపాల్సిన తొలిరోజుల్లో అతను సృష్టించిన అల్లకల్లోలం మాత్రం మాధవికి పీడకలలా గుర్తుండిపోయింది. అతన్ని మాత్రం క్షమించలేకపోయింది.

★★★

మాధవి గతంలోంచి బయటపడింది.

లేడీ డాక్టర్‌కీ, నీలకంఠం కూతురు రోషిణికీ జరుగుతున్న సంభాషణ వినబడుతోంది.

"లాభం లేదమ్మా. ముందు డబ్బు ఇవ్వనిదే పని మొదలుపెట్టే ప్రశ్నేలేదు.''

"డాక్టర్‌గారు! ప్లీజ్. ఇవాళ అయితే మా అమ్మా నాన్నా ఇంట్లోలేరు. ఈ సంగతి బయటపడితే మా ఇంట్లో చంపేస్తారు. ప్లీజ్ డాక్టర్ మీ డబ్బు రెండురోజుల్లో ఇచ్చేస్తాను.''

"కుదరదమ్మా. ఇలాంటి కబుర్లు ఇదివరకు చాలా విన్నాను. తరువాత ఇస్తామని డిశ్చార్జ్ అయి వెళ్లిపోయినవాళ్ళు మళ్ళీ వత్తారేరు. అందుకే నా ఫీజు చేతిలో పడితే తప్ప పేషెంట్‌ని ముట్టుకోనని శపథం చేసాను. ఇష్టమైతే కడతారు, లేకుంటే సర్కారు హాస్పిటల్స్ ఉండనే ఉన్నాయి'' డాక్టర్ విసురుగా చెప్పింది.

"ప్లీజ్''

"విసిగించక వెళ్ళు.''

ఇంకాసేపు అక్కడే నిలబడి లాభం లేక రోషిణి ఏడుస్తూ బయటకు వచ్చింది. బయట నిలబడ్డ మాధవిని చూడగానే గతుక్కుమంది. మరుని ముషం భోరుమంది.

"ఊరుకోమ్మా ఊరుకో'' మాధవి ఓదార్చింది.

ఒక్క నిముషం మనస్సు సంతోషంతో గంతులు వేసింది. అందరికీ వంకలు పెడుతూ ఆడదాన్ని అదుపులో పెట్టాలని ఉపన్యాసాలు దంచిన నీలకంఠం ఆఖరుకి తన కూతుర్నే అదుపులో పెట్టుకోలేకపోవడం ఏమిటి?

పెళ్లి కాకుండానే రోషిణి గర్భం ధరించడం, అది పోగొట్టుకోవాలని తపన పడడం, అది తన కంటపడడం... తాను నీలకంఠం మీద పగ తీర్చుకోవడానికి ఇంతకన్నా సమయం దొరకదు. ఉద్యోగం దొరికిందన్న ఆనందం దక్కనీయకుండా అనుక్షణం తనను వేధించిన నీలకంఠం మొహాన నాలుగూ అడిగి కడిగేయడానికి ఇంతకన్నా మంచి అవకాశం దొరకదు.

మరునిముషం మానవత్వం తిరిగి మేల్కొంది.

ఏం ఆలోచిస్తోంది తను? తండ్రి తప్పిదానికి కూతురి పరిస్థితిని ఆధారం చేసుకుని సాధించడం ఏమిటి? ఇప్పుడు ఒక స్త్రీగా తన కర్తవ్యం రోషిణి పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకుని వీలైతే చేతనైన సాయం చేయడం.

"రోషిణీ! ఏమిటమ్మా ఇది? ఏం జరిగిందసలు?'' అడిగింది లాలనగా.

రోషిణి మళ్ళీ భోరుమంది.

"ఆంటీ! మా నాన్న గుర్రప్పందాల వ్యసనం మీకు తెలుసుగా! నా తరువాత ఇద్దరు పిల్లలు. మాకు అన్నీ అప్పులే. చివరికి నా చదువు కూడా మాన్పించేసి ఉద్యోగంలో చేర్పించాడు నాన్న'' రోషిణి వెక్కుతూ ఆగింది.

మాధవి మౌనంగా వింటోంది.

"మా ఆఫీసులో పని చేసే మదన్ నాకు దగ్గరయ్యాడు. నన్ను పెళ్లి చేసుకుంటానన్నాడు. నమ్మాను. తీరా నాకు నెల తప్పాక కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటే వాళ్ళ నాన్న తిడతాడని తప్పించుకున్నాడు. మా నాన్న కట్నం ఇవ్వలేదు. అందుకని నాకు ఈ అబార్షన్ తప్ప మరో మార్గం కనిపించలేదు. తీరా చూస్తే అదీ జరిగేట్లు లేదు. ఇక నాకు చావే గతి'' గుండెలు పగిలేట్లు ఏడుస్తోంది రోషిణి.

మాధవి రోషిణి భుజం తట్టింది.

"ఊరుకో రోషిణీ! నువ్వు ఇలా బేలవైపోతే లాభం లేదు. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి. నువ్వు ఇట్లా అణిగిపోయి ఉంటే మదన్ నిన్ను ఇంకా మోసం చేస్తాడు. అతన్ని ఎదుర్కో. మోసం చేసి తప్పించుకోవాలనుకుంటున్నాడేమో. అదేమంత సులభంకాదు. నువ్వు గొంతు విప్పితే అతని నోరు మూత పడుతుంది. నువ్వు మూగబోయి మౌనంగా ఏడవడంకాదు. అన్యాయాన్ని ఎదుర్కోవడం నేర్చుకోవాలి. నీకు నేను అండగా ఉంటాను. నలుగురం చేరి మదన్‌కి గడ్డిపెట్టి పెళ్లికి ఒప్పిస్తా. కాదూ అబార్షనే చేయించుకుంటానూ అంటే డబ్బు నేనిస్తాను. రెండూ వద్దు ధైర్యంగా బిడ్డను కంటాను, పెంచుకుంటాను అన్నా నేను నీకు తోడుంటాను. ఆలోచించుకో'' అంది.

"ఆంటీ నిజంగానా!'' రోషిణి మొహంలో తిరిగి జీవం వచ్చింది.

"అవునమ్మా'' రోషిణి చెయ్యి పట్టుకుని ముందుకు అడుగు వేసింది మాధవి.

★



## సంతోషం

"నిన్న బస్సులో మేకుకి తగులుకుని పట్టుచీర చిరిగిపోయినప్పుడు నాకు భలే సంతోషంగా అనిపించిందే!''

"అదేమిటే మరీ విడ్డూరంగా మాట్లాడుతున్నావ్! పట్టుచీర చిరిగిపోయినందుకు బాధపడాలిగానీ సంతోషంగా అనిపించడం ఏమిటి?''

"చిరిగింది నా పట్టుచీర కాదు, మా పక్కింటావిడది.''

## శుద్ధ అబద్ధం

"మీరన్నీ కాపీ కార్టూన్లే గీస్తారని మీపై ఓ విమర్శ ఉంది. దీనికి మీరేమంటారు?'' ఓ కార్టూనిస్టుని అడిగాడో విలేకరి.

దానికి ఆ కార్టూనిస్టు కోపంగా ఇలా అన్నాడు-

"అదంతా శుద్ధ అబద్ధం. నేనిప్పటిదాకా గీసిన పదివేల కార్టూన్లలో ఓ పది పన్నెండు సొంతంగా గీసినవి కూడా ఉన్నాయి.''

## డౌట్

ఓ జూనియర్ నటి ఓ సీనియర్ నటిని కలిసి "మిమ్మల్నడిగి ఓ డౌట్ తీర్చుకుందామని వచ్చాను మేడమ్'' అంది.

"ఫర్వాలేదు అడుగమ్మా'' అంది సీనియర్ నటి.

అప్పుడా జూనియర్ నటి ఇలా అడిగింది.

"పెళ్లికీ పెళ్లికీ ఎంత ఎడం ఉండడం మంచిది?''

## తప్పులు

"ఏంటయ్యా ఈ లెటర్ నిండా ఇన్ని తప్పులు?'' టైప్ చేసిన కాగితాన్ని టైపిస్ట్ మీదకు విసిరేస్తూ కోపంగా అరిచాడు ఆఫీసరు.

దానికా టైపిస్టు తాపీగా ఇలా అన్నాడు. "ఇందులో నా తప్పేం లేదు సార్. మన ఆఫీసు వాస్తు బొత్తిగా బాగోలేదు. అందుకే ఎంత శ్రద్ధగా చేసినా అలా తప్పులొస్తున్నాయి.''

- భానుకిరణ్ (సీతాఫల్‌మండి)

